కర్ణాటకలో 3 గంటల కరెంటే

- ట్రాన్స్‌ఫార్మర్ కాలితే నెల ఆగాలి
- ఫోన్ చార్జింగ్‌కూ తిప్పలే
- కాంగ్రెస్‌కు ఓటేసి బాధపడుతున్నరు
- మంత్రి హరీశ్‌రావు ఎదుట కర్ణాటక కష్టాలు ఏకరువు పెట్టిన ప్రజలు
- కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు ఇచ్చి ఐదునెలలైనా కాంగ్రెస్ నెరవేర్చడం లేదు
- హుడ్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో హరీశ్‌రావు

ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి (మెటల్‌కుంటవాసి.. కర్ణాటక అల్లుడు)

సంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో 3 గంటల కరెంటే ఇస్తున్నారని, సెల్‌ఫోన్ చార్జింగ్‌కు కూడా కరెంట్ ఉండటం లేదని ఆ రాష్ట్ర ప్రజల బాధలు కళ్లారా చూసిన జహీరాబాద్‌వాసులు తెలిపారు.కాంగ్రెస్ పాలనలో కన్నడ ప్రజలు పడుతున్న కష్టాలను మంత్రి హరీశ్‌రావు ఎదుట ఏకరువు పెట్టారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొణింటి మాణిక్‌రావుతో కలిసి జహీరాబాద్‌లోని బసవ ఫంక్షన్‌హాల్‌లో కుల సంఘాల పెద్దలతో సమావేశయ్యారు. న్యాల్‌కల్ మండలం హుడ్నూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కర్ణాటకతో చుట్టరికం, స్నేహబంధం ఉన్నవారితో ఆసక్తికరంగా సంభాషించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో కర్ణాటక తరహా కటిక చీకట్లు కావాల్నా? కట్కా వేస్తే వచ్చే కరెంటు కావాల్నా? అని ప్రశ్నించారు. స్థానికంగా అందుబాటులో ఉండే మాణిక్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీ బీబీ పాటిల్, దేవీప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు నరోత్తం, తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు ఉమకాంత్‌పాటిల్, గుండప్ప, వీరారెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

కర్ణాటకలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుందామన్నా కరెంటు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బూచనెల్లి గ్రామానికి చెందిన మల్లేశం హుడ్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు ఎదుట ఏకరువు పెట్టారు. వారిద్దరి మధ్య సంభాషణ ఇలా..

మంత్రి హరీశ్‌రావు : బ్రదర్ నీ పేరేంది? కర్ణాటక వాళ్ల గురించి ఏమో చెప్తున్నవ్?

మల్లేశం: సర్ నా పేరు మల్లేశం. నాది పక్కనే బూచనెల్లి. మహీంద్రా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నా. అందులో సగం మంది కర్ణాటక వాళ్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని మాకు చెప్తున్నారు.

మంత్రి హరీశ్‌రావు : కర్ణాటక నుంచి వచ్చి ఇక్కడ ఉన్నవాళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయొవద్దని చెప్తున్నారా? వారి పేర్లేంటి?

మల్లేశం: కర్ణాటకల వాళ్లు నా దోస్తులు సర్. ఒకరు బాపురెడ్డి, మరొకరు ఉమేశ్.

మంత్రి హరీశ్‌రావు : కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయద్దు అంటున్నారు?

మల్లేశం: వాళ్లకు 24 గంటల ఫ్రీ కరెంటు ఇస్తామని చెప్పారంట. ఇప్పుడు మూడు గంటల కరెంటు కూడా ఉండటం లేదంట. కరెంటు గురించి అడిగితే కేంద్రంలో రాహుల్‌గెలిస్తే ఫుల్ కరెంటు ఇస్తామని చెప్తున్నారట.

మంత్రి హరీశ్‌రావు : కర్ణాటకలో కరెంటు కష్టాలు అంతటా ఉన్నాయా?

మల్లేశం: అవును సర్. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి ఐదు గంటల కరెంటు ఇచ్చారు. అదీ రాత్రివేళ్లల్లో మూడు గంటల కరెంటు ఇచ్చేవారు. ప్రస్తుతం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు వస్తున్నది. ఓటర్లు జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయండి. లేదంటే సముద్రంలో పడతామంటే కాంగ్రెస్‌కు ఓటు వేయండి. పచ్చని పంటలు కావాలంటే బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు ఓటు వేయండి.

మంత్రి హరీశ్‌రావు : మల్లేశం ముచ్చట మనసునపట్టింది. మల్లేశం మాట విన్న ఎవ్వరూ కాంగ్రెస్‌కు ఓటు వేయరు. కాంగ్రెస్‌కు ఓటు వేసి ఎవ్వరూ మోసపోకండి.

కర్ణాటకలో ట్రాన్స్‌ఫార్మర్ కాలితే అంతే!

కర్ణాటకలో ట్రాన్స్‌ఫార్మర్ కాలితే అంతేనని, దాన్ని మార్చేందుకు 30 రోజులైనా పడుతుందని మెటల్‌కుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి తెలిపారు. తన అత్తగారిది కర్ణాటక అని, అక్కడి బాధలను ప్రత్యక్షంగా అనుభవించానని హరీశ్‌రావుతో చెప్పారు. వారిపురి మధ్య జరిగిన సంభాషణ ఇలా..

రాజేందర్‌రెడ్డి: సర్ హుమ్నాబాద్ తాలూకాలోని ముస్తర్‌వాడి మా అత్తగారి ఊరు

మంత్రి హరీశ్‌రావు : మీ మామ పేరు ఏమిటి, మీ భార్య పేరు ఏమిటి?

రాజేందర్‌రెడ్డి: మా మామ పేరు హన్మంత్‌రెడ్డి. మా భార్య పేరు సరిత.

మంత్రి హరీశ్‌రావు: అత్తగారి ఇంటికిపోతే అక్కడ ఏమైంది చెప్పు?

రాజేందర్‌రెడ్డి: సర్ ఈ మధ్యనే మా అత్తగారి ఇంటికి వెళ్లాను. అక్కడ కరెంటు సమస్య ఎక్కువగా ఉంది. కరెంటు గురించి అడిగితే ప్రజలు ఆశ్చర్యకరమైన విషయాలు చెప్పారు. బీజేపీ అధికారంలో ఉండగా 7 గంటల కరెంటు ఇచ్చేవారట. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మూడు గంటల కరెంటు ఇస్తున్నారట. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే నెలకు మారుస్తారట సర్. పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలు ఏవీ అమలు కావడం లేదట.

మంత్రి హరీశ్‌రావు : మన దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లో మారుస్తాం. 24 గంటల కరెంట్ ఇస్తాం. 24 గంటల కరెంట్ కావాలి అనేవారు బీఆర్ఎస్‌కు, ఐదు గంటల కరెంట్ కావాలి అనేవాళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి

జనం : సర్ మాకు 24 గంటల కరెంటు కావాలి, మేము బీఆర్ఎస్ పార్టీకే ఓటేస్తాం..

ఎన్నికలప్పుడే కాంగ్రెసోళ్లు కనిపిస్తరు

రాహుల్‌గాంధీ కాదు.. ఎలక్షన్ గాంధీ

- రాహుల్ మొహబ్బత్‌కి దుకాణ్ అంటే.. రేటెంతరెడ్డి లంచాల దుకాణం తెరిచారు
- 3 గంటల కరెంట్, రైతుబంధు పైసలతోతాగుతారని అవమానం
- అర్వింద్ అహంకారానికి హద్దే లేదు
- సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించండి
- సౌత్‌ఇండియాలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారు
- కోరుట్ల రోడ్ షోలో ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో జనం మధ్యలో విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే వస్తారని, అందుకే అతడిని ఎలక్షన్ గాంధీ అని అంటారని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. కోరుట్లలో ఎన్నికలు వచ్చినప్పుడే నర్సింగరావు అనే కాంగ్రెస్ అభ్యర్థి వస్తాడని, మిగిలిన సమయంలో ఆయన ఏనాడూ కనిపించడని, ఎలక్షన్ గాంధీ పార్టీలో ఉన్న ఎలక్షన్‌రావు నర్సింగరావు అని చురకలంటించారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గ పరిధి బండలింగాపూర్, వెల్లుల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, అయిలాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన రోడ్‌షోలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగురాని రాహుల్ గాంధీ, హిందీరాని రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ ఇటీవల తెలంగాణకు వచ్చిన సమయంలో కాంగ్రెస్ అంటే మొహబ్బత్ దుకాణ్ పార్టీ అన్నారని, మొహబ్బత్ దుకాణ్ అంటే ప్రేమ ఉన్న సంస్థ అని అర్థమని, అయితే హిందీ అర్థం కాక రాహుల్ మాటలను ఇంకోలా అర్థం చేసుకొని రేవంత్‌రెడ్డి టికెట్ల కోసం లంచాల దుకాణాన్ని తెరిచి రేటెంతరెడ్డిగా మారిపోయాడని కవిత ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ గెలుపే తెలంగాణ ప్రజల గెలుపు అని పేర్కొన్నారు. సాధించిన తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని, ప్రపంచం ముందు తెలంగాణ ప్రజలు సగర్వంగా తలెత్తుకునేలా చేశారని అన్నారు. కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

రైతుల గురించి ఆలోచించిన ఒకే ఒక్క నేత కేసీఆర్

సీఎం కేసీఆర్ కంటే ముందు ఎవరైనా రైతుల గురించి, వారికి కావాల్సిన సాగునీరు, కరెంట్ గురించి ఆలోచించారా? అని కవిత ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతుల గురించి ఆలోచించి వారికి రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తును అందజేశారని చెప్పారు. 50 ఏండ్ల క్రితం వ్యవసాయం సరిగా లేకపోవడం, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రాంత మహిళలు వారి కుటుంబాల కోసం బీడీ కార్మికులుగా మారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులున్నా ఏ రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదని, సీఎం కేసీఆర్ మాత్రమే బీడీ కార్మికులకు పెన్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చేనాటికి సిలిండర్ ధర రూ.400గా ఉండేదని, ఇప్పుడు దాన్ని 1200కు పెంచి నిరుపేదల నడ్డి విరిచారని కవిత మండిపడ్డారు. సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యాక సిలిండర్‌ను రూ.400కే అందజేస్తామని, మిగిలిన రూ.800 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రైతులందరికీ సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని వర్తింపజేశారని, భూమిలేని కుటుంబాలకు సైతం ధీమా ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో బీపీఎల్‌కు దిగువన ఉన్న 93 లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా పథకానికి రూపకల్పన చేశారని చెప్పారు. ఈ పథకంపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్.. 'చనిపోయిన వారికి బీమా ఇస్తారా? బతికినవారికి బీమా ఇస్తారా?' అంటూ అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని, పండ్లు ఇకిలిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ వారి తలకాయలు తీయాలని మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. ఇవేం మాటలు..? ఇదేనా మర్యాద..? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మర్యాదస్తులం కనుకనే బీజేపీ, కాంగ్రెస్ వారి అర్థంపర్థంలేని మాటలను భరిస్తున్నామని, అడ్డదిడ్డంగా మాట్లాడటం లేదని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. మూడు నెలలు గడువక ముందే హామీలన్నింటినీ ఎగవేసిందని మండిపడ్డారు. పదేండ్లుగా సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతోపాటు ఇవ్వని వాటిని సైతం అమలు చేస్తున్నారని తెలిపారు. బీజేపీ చేసే వాగ్దానాలకు, వారి వ్యవహారశైలికి అంతుపొంతులేదని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడ్డదిడ్డంగా, అహంకార పూరితంగా, అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని, అధికారం లేని సమయంలోనే ఇలాంటి ప్రవర్తన ఉంటే ఒకవేళ అధికారం వస్తే ఆయన ప్రవర్తన ఎలా ఉంటుందో? ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి బలపర్చి, దక్షిణ భారత దేశంలోనే హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టించేలా దీవించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే సీఎం కేసీఆర్ మూడోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించి దక్షిణ భారతదేశ చరిత్రను తిరగరాస్తారన్న నమ్మకం ఉన్నదని ధీమా వ్యక్తంచేశారు. రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు.

> పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నారు. దసరా ముందు రైతుబంధు వేస్తే తాగి డబ్బులు నాశనం చేసుకుంటారని అవహేళన చేశారు. ధరణిని బంగాళఖాతంలో వేస్తామంటున్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తే పంటలు పండుతాయా?
>
> - ఎమ్మెల్సీ కవిత

కాంగ్రెస్‌లో 20 మంది సీఎం అభ్యర్థులే

- సీఎం అభ్యర్థి ఎవరో చెప్పకోలేని దుస్థితి వారిది
- కేసీఆర్ ప్రభుత్వంలోనే ముస్లింలకు ప్రయోజనం
- మీడియాతో హోంమంత్రి మహమూద్ అలీ

ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ

ఖమ్మం, నవంబర్ 16: కాంగ్రెస్‌లో ఇరవై మంది సీఎం అభ్యర్థులున్నారంటూ ఆ పార్టీ నేతలే చెప్పుకుంటుండటం సిగ్గుచేటని హోంమంత్రి మహమూద్ అలీ విమర్శించారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పుకోలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని దుయ్యబట్టారు. అలాంటి పార్టీతో అభివృద్ధి సాధ్యమా? అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా అసలైన కాంగ్రెస్ వ్యక్తి కాదని, తొలుత ఆర్ఎస్ఎస్ కార్యకర్త అని విమర్శించారు. పూర్తి ఆర్ఎస్ఎస్ భావజాలమున్న రేవంత్‌కు తెలంగాణ ప్రజలు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ సీఎం అభ్యర్థి కేసీఆరేనని స్పష్టం చేశారు. ప్రతి విషయానికీ ఒంటికాలిపై లేస్తున్న కాంగ్రెస్ నాయకులు మొదట వారిని వారు సమీక్షించుకోవాలని హితవుపలికారు. గురువారం ఖమ్మంలో పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మైనార్టీలకు అనేక ప్రయోజనాలు చేకూరాయని అన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అనే భావనతోనే తాను కరీంనగర్‌లో మాట్లాడానని, ముస్లిం మైనార్టీలను తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించడం విచారకరమని అన్నారు. రవాణా మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్ముడు పోయేది కాంగ్రెస్ నేతలే!

- అవాక్కైన ఆ పార్టీ నేత తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎమ్మెల్యేగా గెలిచినా అమ్ముడుపోయేది కాంగ్రెస్ నేతలేనని నెటిజన్లు తేల్చి చెప్పారు. దీంతో కాంగ్రెస్ నేత, ప్రచార కమిటీ సభ్యుడు తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ అవాక్కయ్యారు. ఆయనకు చెందిన ఓ యూట్యూబ్ చానల్‌లో తీన్మార్ మల్లన్న తాజాగా ఒక పోల్ నిర్వహించారు. 'ఈ కింది పార్టీల్లో గెలిచిన తర్వాత అమ్ముడుపోయే పార్టీ ఎమ్మెల్యేలు ఎవరు?' అన్న ప్రశ్నకు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతరులు అనే ఆప్షన్లు ఇచ్చారు. దీనికి సుమారు 2 వేల మంది నెటిజన్లు ఓటేయగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోతారంటూ 67 శాతం మంది ఓటేయడం గమనార్హం. బీజేపీ నేతలంటూ అంటూ 15 శాతం మంది తేల్చిచెప్పారు. ఈ ఫలితాలు చూసిన కాంగ్రెస్ నేత తీన్మార్ మల్లన్న అవాక్కయ్యారు. కాంగ్రెస్ నేతలు అమ్ముడుపోతారనే భావన ప్రజల్లో బలంగా ఉన్నదని ఒప్పుకున్నారు. అయితే ఈసారి అమ్ముడుపోరని, బీఆర్ఎస్ నేతలే అమ్ముడుపోతారంటూ కవరింగ్ చేసే ప్రయత్నం చేశారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీన్మార్ మల్లన్నను నెటిజన్లు ఓ ఆట ఆడుకుంటున్నారు.

శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌పై పిటిషన్

- హైకోర్టులో విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, నవంబర్16, (నమస్తే తెలంగాణ): గత శాసనసభ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ నుంచి గెలుపొందిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై ఎలక్షన్ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నదని, అందువల్ల ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని కోరుతూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఓటరు చలువగాలి రాఘవేంద్రరాజు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈసీ తరపు న్యాయవాది లేకపోవడంతో తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అఫిడవిట్ ట్యాంపరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులంతా ఇంకా అక్కడే బాధ్యతలు నిర్వహించడాన్ని తప్పుపడుతూ చలువగాలి రాఘవేంద్ర రాజు మరో పిటిషన్ దాఖలుచేశారు. ఆ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ కూడా శుక్రవారానికి వాయిదా పడింది.

నోట్ల కట్టలు.. కాంగ్రెస్ కుట్రలు

- ఓట్ల కోసం హస్తం పార్టీ ప్రలోభాలు
- నేతల కొనుగోలుకు సంచులు
- పోలీసులకు చిక్కిన చెన్నూర్ అభ్యర్థి 'వివేక్' సిబ్బంది
- 50 లక్షలు, బైక్, ఫోన్లు స్వాధీనం
- శ్రీధర్‌బాబు గోడ గడియారాలూ సీజ్

ఓటర్లకు పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన శ్రీధర్‌బాబు బొమ్మతో ఉన్న గోడగడియారాలు

అక్రమంగా డబ్బులు తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ కంపెనీ ఉద్యోగి

హైదరాబాద్/పెద్దపల్లి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)/చెన్నూర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థులు నోట్ల కట్టలతో కుట్రలకు తెరతీశారు. ఎలాగూ గెలవలేమని భావించిన హస్తం నేతలు ప్రలోభాలకు పాల్పడుతున్నారు. ఇతర పార్టీల నాయకుల కొనుగోలుకు కరెన్సీ కట్టలను ఎరగా వేస్తున్నారు. ఇలా డబ్బులను చేరవేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులకు చెందిన వ్యక్తులు గురువారం పోలీసులకు చిక్కారు. చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి చెందిన కంపెనీ ఉద్యోగులు రూ.50 లక్షలు తరలిస్తూ పోలీసులకు చిక్కారు. అలాగే మంథని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు ఫొటోతో ఉన్న రూ.19,600 విలువైన 5,368 గోడ గడియాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిబ్బంది పట్టుకున్నారు.

వివేక్ ఆదేశాల మేరకే తరలిస్తున్నాం..

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి చెందిన కంపెనీ ఉద్యోగులు (విశాఖ ఇండస్ట్రీస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్) కంజుల రవి కిశోర్, (వెలుగు దిన పత్రిక మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి) ముదిగంటి ప్రేమ్‌కుమార్ రూ.50 లక్షలతో హైదరాబాద్ నుంచి చెన్నూర్‌కు బైక్‌పై బయలు దేరారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గురువారం పోలీసులు బైక్‌ను ఆపి వీరి బ్యాగును తనిఖీ చేయగా రూ.50 లక్షలు దొరికాయి. తమ యజమాని వివేక్ ఆదేశాల మేరకు చెన్నూరు నియోజకవర్గంలో డబ్బులు పంచేందుకు, ఇతర పార్టీల నాయకుల కొనుగోలుకు రూ.50 లక్షలు తరలిస్తున్నట్టు నిందితులు ఒప్పుకున్నారు. నగదుతోపాటు రెండు మొబైల్ ఫోన్లు, మోటారు సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీధర్‌బాబు ఫొటోతో గోడగడియారాలు

మంథని కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఓటర్లకు పంచేందుకు తీసుకొస్తున్న శ్రీధర్‌బాబు ఫొటోతో కూడిన గోడ గడియారాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ అండ్ స్టాటిస్టికల్ బృందం పట్టుకున్నది. సుమారు 19,600 విలువైన 5,368 ప్లాస్టిక్ వాల్ క్లాక్‌లను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను పెద్దపల్లి జిల్లా మంథని పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గడియారాలను హైదరాబాద్ మలక్‌పేటలోని శ్రీ కృప మార్కెట్‌లో కొనుగోలు చేసి మంథని నియోజకవర్గంలోని కాటారం రెవెన్యూ డివిజన్‌లోని చింతకాని ఎక్స్‌రోడ్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ ఏజెన్సీస్‌కు శ్రీరామ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా తరలిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. వాల్‌క్లాక్‌లను సీజ్‌చేశారు.

కొడంగల్‌లో కొనుగోలు యత్నాలు భగ్నం

ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల కొనుగోలుకు ప్రయత్నించగా ఆ పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ నివాసంలో పెద్ద ఎత్తున నగదు, మద్యం నిల్వ చేశారన్న సమాచారంతో మంగళవారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నేతలు కూడా ఇదే తరహాలో ఓటర్లను ప్రలోభాలకు గురిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థిపై ఈడీకి ఫిర్యాదు చేస్తా

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

పెద్దపల్లి టౌన్, నవంబర్ 16: పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుపై ఈడీ, ఐటీ అధికారులకు ఫిర్యాదు చేస్తానని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడుతూ విజయరమణారావుకు సింగపూర్, హంకాంగ్, జర్మనీలో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని. అక్కడ పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. ఈడీ విచారణకుముందే పోటీ నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

మిర్యాలగూడలో ఐటీ దాడులు

మిర్యాలగూడ, నవంబర్ 16 : అసెంబ్లీ ఎన్నికల వేళ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఐటీ దాడులు కలకలం రేపుతున్నాయి. మిర్యాలగూడలోని పలు రైస్ మిల్లుల యజమానులతోపాటు ఓ కాంట్రాక్టర్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కాంట్రాక్టర్ ఇంజమూరి శ్రీధర్ ఇంటితోపాటు రైస్ మిల్లు యజమానులు రంగా రంజిత్, రంగా శ్రీధర్, బండారు కుశలయ్య, రేపాల అంతయ్య ఇండ్లు, మిల్లుల్లో గురువారం ఉదయం 4 నుంచి అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. త్రిపురారం మండలం ముకుందాపురంలోని వెంకటసాయి సాల్వెంట్ ఆయిల్ మిల్లులోనూ సోదాలు చేపట్టినట్టు సమాచారం. 40 మంది అధికారులు బృందాలుగా విడిపోయి ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తున్నది.

దాడులు జరగలేదు: ఎమ్మెల్యే భాస్కర్‌రావు

తన ఇంట్లో ఐతే దాడులు జరుగుతున్నాయని కొన్ని టీవీ ఛానళ్లు అసత్య ప్రచారం చేయడం సరికాదని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పేర్కొన్నారు. తనకు దేశంలోని పలు పవర్ ప్లాంట్లలో వాటాలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని, వాటిని నిరూపిస్తే ఆయా ఛానళ్ల వారికే రాసి ఇస్తానని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు కొందరు కావాలనే తనపై అసత్య ప్రచారం చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

హాలియాలోనూ సోదాలు

హాలియా: నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి నివాసంతోపాటు ఆయన డైరెక్టర్‌గా ఉన్న హాలియా పట్టణ పరిధిలోని పాలెం స్టేజీ వద్దనున్న వజ్రతేజ రైస్ మిల్లులో ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. రాత్రిపొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. ఐటీ దాడులకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు రాలేదు.

సీట్లమ్ముకునే రేవ